క్లుప్తంగా

శాశ్వత పరిష్కారానికే 'భూభారతి'

అదనపు కలెక్టర్ నగేశ్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

హవేళీఘణాపూర్(మెదక్): భూభారతి రెవెన్యూ సదస్సుకు వచ్చే రైతుల సమస్యలను అధికారులు ఓపికతో విని వాటికి అవసరమైన పత్రాలు తెప్పించుకొని దరఖాస్తులు స్వీకరించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. బుధవారం మండలంలోని నాగాపూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోకి వచ్చి భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూరేణుక, గిర్దావర్ ఆబేద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సును మెదక్ ఆర్డీఓ రమాదేవి పరిశీలించారు. ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే భూభారతి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ 5లక్షలతో మోడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మిస్తుందని తెలిపారు. ఇంటి నిర్మాణం బాగుందని లబ్ధిదారులు ఇదే కొలతలో నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఎక్కువ వైశాల్యంలో నిర్మించి అప్పుపాలు కావొద్దని సూచించారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి



ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న శ్యాంరావు

రేగోడ్(మెదక్): పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి అన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో బుధవారం లబ్ధిదారుల స్థలం వద్ద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, నాయకులు నారాయణ, చిదిరె కృష్ణ, కృష్ణమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన

నర్సాపూర్ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఖాజీపేటలో మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శుల బృందానికి బుధవారం అవగాహన కల్పించారు. నర్సాపూర్ ఎంపీడీఓ మధులత, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యదర్శులకు ఖాజీపేటలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను చూపించారు. ఎంపీడీఓ మధులత మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఖాజీపేట పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కావడంతో 101 ఇళ్లు మంజూరు కాగా.. 16 ఇళ్లు ఆయా నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పనులు ప్రారంభించాలి

జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం అన్నారు. బుధవారం మండలంలోని మిర్జాపల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ముగ్గు పోసి తీయాల్సిన ఫొటోల గురించి వివరించారు. 450 అడుగుల నుంచి 500 అడుగుల్లోనే ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, ఏఈ లోకేష్, మండలంలోని గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త భవనం ప్రారంభం ఎప్పుడో?

ఆరేళ్లుగా కేజీబీవీ కళాశాల భవన నిర్మాణ పనులు

- ఒకే భవనంలో కళాశాల, పాఠశాల నిర్వహణ
- మంత్రి దామోదర ఇలాఖాలో విద్యార్థుల అవస్థలు



కేజీబీవీ కళాశాల భవనం

అల్లాదుర్గం(మెదక్): ఆరేళ్లుగా కేజీబీవీ కళాశాల భవన నిర్మాణం పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఆలసత్వం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. ఒకే భవనంలో పాఠశాల, కళాశాల నిర్వహిస్తుండటంతో విద్యార్థినిలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తరగతి గదిలోనే చదువుకోవడం, పడుకోవడం జరుగుతుంది. ఒకే గదిలో 50 నుంచి 60 మంది విద్యార్థినిలు నిద్రిస్తున్నారు. మరుగుదొడ్లు, బాత్‌రూంలు సరిపోక పడరాని పాట్లు పడుతున్నారు. ఇది అల్లాదుర్గం కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల భవనం దుస్థితి.

-అల్లాదుర్గంలో 2018లో బాలికల కళాశాలను ప్రభుత్వం ప్రారంభించింది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోనే కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకే భవనంలో పాఠశాల, కళాశాల తరగతులు, హాస్టల్ నిర్వహించడంతో విద్యార్థినిలు పడరాని పాట్లు పడుతున్నారు.

భవన నిర్మాణం ఎప్పుడో

అల్లాదుర్గం కేజీబీవీ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం ఆరేళ్ల క్రితం రూ:2.5 కోట్లు మంజూరు చేసింది. కళాశాల భవన నిర్మాణం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆరేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. జూన్ 12వ తేదీ నుంచి కళాశాల, పాఠశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తయి, చిన్న, చిన్న పనులు కొనసాగుతున్నాయి. ఈసారి కూడా కొత్త భవనం ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. పాత సమస్యలతోనే విద్యార్థినిలో కొత్త విద్య సంవత్సరంలోకి అడుగు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గమైనా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి . మంత్రి చొరవ తీసుకుని కొత్త భవనం ప్రారంభించాలని కోరుతున్నారు.

కళాశాల భవనం కొత్త విద్య సంవత్సరం ప్రారంభానికి ముందే అప్పగిస్తామని కాంట్రాక్టర్ చెప్పినట్లు కేజీబీవీ ప్రిన్స్‌పాల్ శ్రావంతి చెప్పారు.చిన్న చిన్న పనులు ఉన్నాయని చెప్పారని, ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేసి అప్పగించాలని చెప్పామని తెలిపారు. వెంటనే పనులు పూర్తి చేసి భవనం ప్రారంభిస్తే ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

- కళాశాలలో సీఈసీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఒకేషనల్ కోర్సులు ప్రారంభించారు. ఫస్ట్ ఇయర్, సెకండియర్ కలిపి 160 మంది విద్యార్థినిలు చదువుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10 తరగతులకు కలిపి 200 మంది బాలికలు చదువుతున్నారు.
- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఒకేషనల్ కోర్సు విద్యార్థినిలకు ల్యాబ్ సౌకర్యం లేక సరైన విద్య అందడం లేదు.
- కళాశాల, పాఠశాల విద్యార్థినిలకు సరిపడా వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తరగతి గదులలోనే చదవడం, పడుకోవడం జరుగుతుంది. ఒక్కో గదిలో 50 నుంచి 60 మంది వరకు నిద్రిస్తున్నారు. మరి కొందరు డైనింగ్‌హాల్‌లో పడుకోవల్సిన దుస్థితి నెలకొంది.
- 360 మంది బాలికలు చదువున్న ఒకే భవనంలో సరిపడా మరుగుదొడ్లు, బాత్ రూంలు, భోజనం చేయడానికి హాల్ లేక పోవడంతో విద్యార్థినిలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.



గొల్లగూడెంలో బండ్ల ఊరేగింపు

ఘనంగా ఏరువాక వేడుకలు



బహిరన్‌దిబ్బలో ఏరువాక వేడుకలు

టేక్మాల్(మెదక్): మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని గొల్లగూడెంలో గ్రామ దేవత లైనా దుర్గమ్మ, పోచమ్మలతో పాటూ మత్తడి పోచమ్మకు బండ్ల ఊరేగింపు నిర్వహించారు. దనూర, బొడ్మట్‌పల్లి తదితర గ్రామాల్లో ఎడ్లను అందంగా అలంకరించి డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించారు.

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలో బుధవారం రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ, చిల్వెర, అల్లాదుర్గం, మాందాపూర్, చెవెళ్ల రైతులు ఎద్దులను అలంకరించారు. రైతులు డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక దేవాలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలి

బీఆర్ఎస్ యువత కార్యదర్శి భాస్కర్



భాస్కర్

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను పెంచడం సిగ్గుచేటని బీఆర్ఎస్ యువత విభాగం కార్యదర్శి నాయికోటి భాస్కర్ ఆరోపించారు. బుధవారం ఆయన టేక్మాల్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని మండిపడ్డారు. ప్రస్తుతం రూ.1150 ఉన్న ఆర్డినరీ బస్సు రేట్లు రూ.1400కు పెంచడం, రూ.1300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాసులను రూ.1600లకు పెంచడం, రూ.1450 ఉన్న మెట్రో డీలక్స్ పాసు రూ.1800 పెంచడం ఏమిటని ప్రశ్నించారు. విద్యా భరోసా కార్డు, ప్రతి విద్యార్థిని విద్యార్థికి ఫ్రీ ఇంటర్నెట్ సౌకర్యం, ప్రతి మండలానికి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన పాఠశాల ఏర్పాటు చేస్తామని ఉచిత ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పిస్తామని మాట తప్పిందని మండిపడ్డారు. చదువుకునే అమ్మాయిలకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు, ఇంటర్ పాస్ అయిన వారికి రూ.25వేలు, పోస్ట్ గ్రాడ్యుయేట్ రూ1,50 లక్షలు అమలు చేస్తామని, నిరుపేద విద్యార్థులకు మొండిచేయి చూపిందన్నారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే బీఆర్ఎస్ పార్టీ పక్షన విద్యార్థులకు అండగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సంపూర్ణ పోషకాహారం అందివ్వనున్నట్లు ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ సంతోష అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యాని పథకాన్ని బుధవారం ఆమె శివ్వంపేటలో ప్రారంభించారు. గ్రామంలో అమ్మమాట- అంగన్‌వాడీ బాట ర్యాలీ చేపట్టి ఎగ్ బిర్యానీ పథకాన్ని ప్రారంభించారు. పిల్లలకు, గర్భిణిలకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిప్పించాల్సిందిగా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. నిత్యం పోషకాహారంతో పాటు ప్రతి బుధవారం ఎగ్ బిర్యానీ అందివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, నవనీత ఉన్నారు.



కౌడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్‌బిర్యానీని వడ్డించిన దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం ఎగ్ బిర్యానీ ప్రారంభించినట్లు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ఖమర్ సుల్తాన తెలిపారు. కౌడిపల్లిలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంవద్ద అంగన్‌వాడీ బడిబాట నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, తల్లులో పోషకారం అందించేందుకు ప్రభుత్వం ప్రతి బుధవారం ఎగ్‌బిర్యానీతో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని చెప్పారు. ఇక్కడ ప్రీస్కూల్ ఆట పాటలతో విద్య బోధన చేస్తు సృజనాత్మకతను వెలికితీస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల, రజియసుల్తాన లబ్ధిదారులు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు. దీంతో పాటు మండలంలోని కొట్టాల, కంచన్‌పల్లి, భుజిరంపేట, రాయిలాపూర్ తదితర గ్రామాలలో అంగన్‌వాడీ టీచర్లు బడిబాట నిర్వహించారు.

108 మందికి ఇళ్ల మంజూరు పత్రాల అందజేత



మంజూరు పత్రాలు అందజేస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

తూప్రాన్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 108 మంజూరు పత్రాలను అందజేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు జిన్నా భగవాన్ రెడ్డి, బి.రాజు, కాంగ్రెస్ నాయకులు మామిండ్ల కృష్ణ, బజారు విశ్వరాజ్, నాగరాజు గౌడ్, కుమ్మరి రఘుపతి, ఎండీ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం పోతారం, పాలట, మనోహరాబాద్, జీడిపల్లి, పర్కిబండ గ్రామాలలో అందజేశారు.

మా పొట్ట కొట్టొద్దు

మార్వాడీలకు వ్యతిరేకంగా వ్యాపారుల ధర్నా

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన వెల్దుర్తిలో రోజురోజుకూ మార్వాడీ దుకాణాలు విస్తరించడాన్ని నిరసిస్తూ వర్తక, వాణిజ్య సంస్థల నిర్వాహకులు నిరసన చేపట్టారు. మండల కేంద్రంలోని దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి అంబేద్కర్ చౌరస్తా వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. ప్రస్తుతం ఉన్న దుకాణాలు కాకుండా కొత్తగా ఏర్పాటు చేయబోమని గతంలో హామీనిచ్చిన మార్వాడీలు.. మాటమార్చారన్నారు. నూతనంగా హార్డ్‌వేర్ దుకాణం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయడంపై రెండు రోజుల క్రితం ఆందోళన చేపడితే ఇద్దరు వ్యాపారులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. స్థానిక వ్యాపారుల పొట్టకొట్టే విధంగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు.

అమ్మ మాట- అంగన్‌వాడీ బాట



అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట

పెద్దశంకరంపేట (మెదక్): అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలో బుధవారం పూసల గల్లీలో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంతోపాటు అన్ని రకాల వసతులను కల్పిస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సరళ, స్వరూప పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, కొల్చారం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ ఆధ్వర్యంలో గ్రామంలో 'తొలిబడి.. అమ్మ ఒడి, మలిబడి అంగన్‌వాడీ పేరుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో శశికళ మాట్లాడుతూ.. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఎగ్ బిర్యాని కార్యక్రమంలో భాగంగా పిల్లలకు, తల్లులకు ఎగ్ బిర్యాని ఆహారంగా అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ శివమ్మ, నీరజ, మేఘమాల, స్వరూప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చిన్నశంకరంపేట ఎంఈఓ పుష్పవేణి కోరారు. బుధవారం చిన్నశంకరంపేట మోడల్ స్కూల్‌లో మండలంలోని హెచ్‌ఎంలతో పాటు పాఠశాల వంట నిర్వాహకులు, పారిశుద్ధ్య నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణతో పాటు టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వంట నిర్వహణ సమయంలో పరివుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

నిధులిస్తేనే ట్రాక్టర్లు నడుపుతాం

పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీఓకు ట్రాక్టర్ల తాళాలు అప్పగిస్తున్న కార్యదర్శులు

అల్లాదుర్గం(మెదక్): పంచాయతీలకు ప్రభుత్వం నిర్వహణ నిధులు మంజూరు చేస్తేనే పంచాయతీ ట్రాక్టర్లు నడిపిస్తామని పంచాయతీ కార్యదర్శుల మండల జేఏసీ హెచ్చరించింది. బుధవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు ట్రాక్టర్ తాళాలను అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17 నెలల నుంచి పారుశుద్ధ్యం , పంచాయతీ ట్రాక్టర్ల బిల్లులు, తాగునీటి, సమావేశాల ఖర్చులు, సంక్షేమ పథకాల సర్వే చేసిన డబ్బులు ఇవ్వక పోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. పెండింగ్ బిల్లులు, పంచాయతీ నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు లింగప్ప, రాములు, ప్రభకర్ , జనార్ధన్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు నడపలేం

పెద్దశంకరంపేట (మెదక్): పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ట్రాక్టర్లను నడపలేమంటూ పంచాయతీ కార్యదర్శులు బుధవారం పెద్ద శంకరంపేట ఎంపీడీవో షాకీర్ అలీకి ట్రాక్టర్ల తాళాలను అందజేశారు. నిధులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మనోహరాబాద్‌లో..

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాలలో చెత్త సేకరణ చేసే ట్రాక్టర్ల భారం ఇక మేము మోయలేమని ఎంపీడీఓ కృష్ణమూర్తికి బుధవారం పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలను అప్పగించారు. 16 నెలలుగా తాము ఎంతో వేదనకు గురవుతున్నామని వాపోయారు.



ఎంపీడీఓకు తాళాలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ట్రాక్టర్ తాళాలు అప్పగింత

చేగుంట(తూప్రాన్): గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను ఎంపీడీఓ చిన్నారెడ్డికి బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ట్రాక్టర్ల నిర్వహణ తమవల్ల కావడంలేదన్నారు. దీంతో ట్రాక్టర్ల తాళాలను ఎంపీడీఓకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రశాంత్, చేగుంట పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి

డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావు



తూప్రాన్/చేగుంట(తూప్రాన్): గ్రామీణ మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని గ్రామైక్య మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావు సూచించారు. బుధవారం చేగుంట ఐకేపీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామైక్య సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడంలో, రికవరీ చేయించడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో చదువు ఆపేసిన వారిని గుర్తించి ఉన్నత చదువులు చదివించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం జాన్ కెనడీ, సీఆర్పీ రాధ, సీసీలు స్వామి, రామస్వామి, అంజ్య, స్వేత, మమత తదితరులు పాల్గొన్నారు. అనంతరం తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కమల

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ కమల నియమితులయ్యారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



నియామకపత్రం అందుకుంటున్న కమల

సంక్షిప్త వార్తలు

◆ ఎల్ఓసీ అందజేత

చేగుంట(తూప్రాన్): బాలుడి చెవి ఆపరేషన్ కోసం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఎల్ఓసీని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జైత్రం తండాలోని రిషివర్ధన్‌కు వినికిడి లోపంతో ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఆర్థిక ఇబ్బందితో ఉన్న రిషివర్ధన్ కుటుంబానికి రూ.8లక్షలు ఎల్ఓసీ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్, నాయకులు వెంగళ్‌రావు. మొజామిల్, శ్రీనివాస్, శ్రీకాంత్, లింగం, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ట్రాక్టర్ సీజ్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ తెలిపారు. బుధవారం నార్సింగి గ్రామ శివారులోని మ్యాతరి సిద్దిరాములు పొలం నుంచి ఖాస్లాపూర్ గ్రామానికి చెందిన గణేష్‌కు చెందిన ట్రాక్టర్‌లో వల్లభాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రాజు మట్టిని తరలిస్తుండగా ఆర్ఐ శ్రీధర్ పట్టుకున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

◆ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి



రేగోడ్(మెదక్): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనాల వెంట అన్ని ధ్రువ పత్రాలు ఉంచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

◆ మోదీ పాలనలో ఆర్థికాభివృద్ధి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రధాని నరేంద్రమోదీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ తెలిపారు. మోదీ0 11ఏళ్ల పాలన పూర్తి అయిన సందర్భంగా మండల బీజేపీ నాయకులు మొక్కలు నాటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమం, దేశ భద్రత, ఆర్థికభద్రత అభివృద్ధి చెందిందన్నారు.కార్యక్రమంలో ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి అశోక్, మండలపార్టీ అధ్యక్షుడు రాకేష్, నాయకులు క్రిష్ణ, ఆంజనేయులు, రాజు, హరీష్, శేఖులు, శాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ శ్రీ గురుపీఠంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్‌లో కొలువైన శ్రీ గురుపీఠంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా పూజలు చేపట్టారు. పండితులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు, హారతితో పాటు హోమం చేపట్టారు. శ్రీ గురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్ అన్నదానం చేశారు. శ్రీ గరుపీఠంలో కొలువైన దత్తాత్రేయ, సాయిబాబా దేవతామూర్తులకు నిత్య పూజలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు భిక్షపతియాదవ్, హన్మంతు, యాదగిరియాదవ్, చిన్నారెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.